
ప్రజాశక్తి
గురువారం 4 జనవరి 2024



పట్టణ సిఐగా జి.డి.బాబు

పలువురు ఎస్‌ఐల బదిలీ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జిడి బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన టౌన్ సిఐ శ్రీనివాసరావు విఆర్‌కు బదిలీ చేశారు. పట్టణ ఎస్‌ఐ నర్సింహమూర్తికి మక్కువ మండలం బదిలీ అయ్యింది. టౌన్ ఎస్‌ఐ-2 ఎన్.భాస్కరరావును పార్వతీపురం డిఎస్‌బికి బదిలీ చేశారు. రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తికి దిశ మహిళా సెల్‌కు బదిలీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో రెండు, మూడేళ్లు పని చేసిన పోలీసు అధికారులను బదిలీ చేస్తూ మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు.

గర్జించిన అంగన్‌వాడీలు

- కలెక్టరేట్ ఎదుట నాలుగు గంటలపాటు బైఠాయింపు
- నడిరోడ్డుపైనే భోజనాలు చేస్తూ నిరసన
- సమస్యలు పరిష్కరించకపోతే పతనం ఖాయం
- హెచ్చరించిన అంగన్వాడీలు
- మద్దతు తెలిపిన సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు



కలెక్టరేట్ వద్ద బైఠాయింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఉమామహేశ్వరి

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తాత్సారం చేయడంతో అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 23 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై వారంతా భగ్గుమన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన వివిధ మండలాల నుంచి అంగన్వాడీలు వేలాదిగా తరలివచ్చి బైఠాయించారు. శాంతి యుతంగా సమ్మె చేస్తున్న తమపై చర్యలు తీసుకుంటామని బెదిరిస్తూ నోటీసులు పంపడంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు, నడిరోడ్డుపైనే భోజనాలు చేస్తూ నిరసన కొనసాగించారు. దాదాపు నాలుగు గంటల పాటు ఆందోళన కొనసాగింది. అంగన్వాడీలకు సిపిఎంతో పాటు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, అధ్యక్ష కార్యదర్శులు పి.సరళారాణి, గంటా జ్యోతి, ఆధ్వర్యంలో బుధవారం జిల్లా నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ స్థానిక పాత బస్టాండు నుండి ప్రధాన రహదారిపై జిల్లా కలెక్టరేట్ వరకూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి తమ నిరసన తెలిపారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆఖరుకు పోలీసులు జోక్యం చేసుకుని ట్రాఫిక్ మళ్లించారు. ఈ సందర్భంగా సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి రాకమునుపు అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం కన్నా వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనం ఇస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ అమలు చేయలేకపోగా, న్యాయంగా వారు చేస్తున్న సమ్మెను అణచివేయాలని చూడడం దారుణమన్నారు. అంగన్వాడీ కేంద్రాలను అనర్హులచే బలవంతంగా తెరిపించి కేంద్రాలను స్వాధీనం చేసుకోవడం, ఈనెల 5లోగా విధులకు హాజరు కాకపోతే అంగన్వాడీలపై చర్యలు చేపడతామని జిల్లా అధికారులచే బెదిరించడం వంటి చర్యలు ప్రభుత్వ దురహంకారానికి, దుర్నీతికి అద్దం పడుతున్నాయని అన్నారు. పంతానికి పోయి ప్రభుత్వం అంగన్వాడీలపై చర్యలకు పాల్పడితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలు ఒక్కటై పోరాటాన్ని తీవ్రస్థాయికి తీసుకువెళ్లి ప్రభుత్వాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించుకొని అంగన్వాడీ నాయకత్వంతో చర్చలు జరిపి కనీస వేతనాలను అమలు చేయాలని కోరారు.

గర్భిణులు, బాలింతలు, సున్నా నుండి ఆరేళ్లలోపు పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్ల అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదని, నిరంతరం నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్, ఆర్టీసీ, రైల్వే ధరలు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగలేదని అన్నారు. అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు హెల్పర్లకు ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం గడపడం కష్టంగా ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు వివిధ రకాల యాప్‌లు తెచ్చారు. ఫోన్లు పని చేయడంలేదన్నారు. ఇందుకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదన్నారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో నెట్ సిగ్నల్ ఉండడంలేదని, దీనివల్ల అంగన్వాడీలు మానసిక వత్తిళ్లకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో సమస్యల పరిష్కారానికి కేంద్రాలను మూసివేసి నిరవధికంగా సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు అమరవేణి, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు వై.మన్మధరావు, నాయకులు వి.ఇందిర, జి.వెంకటరమణ, రైతు సంఘం నాయకులు కొల్లి గంగునాయుడు, రెడ్డి వేణు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, బొత్స లక్ష్మి, పార్వతీపురం ప్రాజెక్టు నాయకులు అలివేలు, గౌరీమణి తో పాటు జిల్లాలోని అన్ని సెక్టార్ల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు



లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, కలెక్టర్ నిశాంత్‌కుమార్

అవ్వాతాతలకు అండగా ప్రభుత్వం

డిప్యూటీ సిఎం రాజన్నదొర

పింఛను కానుక రూ.3 వేలకు పెంపు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం అవ్వాతాతలకు అండగా ఉంటూ, వైఎస్ఆర్ పింఛను కానుకగా రూ.3 వేలకు పెంచినట్టు ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర తెలిపారు. పెంచిన పింఛను కానుక పంపిణీ కార్యక్రమం స్థానిక లయన్స్ క్లబ్‌లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆర్థికంగా మహిళలకు చేయూత ఇవ్వడానికి ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తున్నారన్నారు. పింఛనును సద్వినియోగం చేసుకోవాలనికోరారు. ప్రతీ ఒక్కరూ ఆర్థిక అభ్యున్నతి దిశగా అడుగులు వేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి తేదీన ఉదయాన్నే తలుపుతట్టి పింఛను అందించడం జరుగుతోందన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 1693 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,43,800 మంది పింఛను దార్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ ఛైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

9న పార్వతీపుంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పదో తరగతి అర్హత కలిగిన దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. 18 నుండి 35 ఏళ్ళ గల నిరుద్యోగ వికలాంగులు ఈ మినీ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో డి -మార్ట్, మాక్స్, రిలయన్స్ ట్రెండ్ కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలకు ఎంపిక చేసుకుంటూన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటు సదరం సర్టిఫికెట్, రెస్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్ల ఒరిజినల్, జెరాక్స్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 7997299739 ఫోన్ నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

రేషన్ పంపిణీ పరిశీలన

పాలకొండ: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో చేపట్టిన రేషన్ పంపిణీని స్థానిక తహశీల్దార్ పి. సోమేశ్వర రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎండిఎం ఆపరేటర్‌ను మీ పరిధిలో ఎన్ని కార్డులు ఉన్నాయి, ఎంతమంది లబ్ధిదారులకు రేషన్ ఇప్పటి వరకు పంపిణీ చేశారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట వీఆర్వో బలివాడ శ్రీనివాసరావు ఉన్నారు.

మోకాళ్లపై నిల్చొని సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమాన పనికి సమాన వేతనం తదితర డిమాండ్లతో సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు 15వ రోజు బుధవారం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఎస్ఎ ఉద్యోగులు తమ పట్ల ప్రభుత్వం తీరును నిరసిస్తూ మోకాళ్లపై నిలబడి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ వినూత్న రీతిగా నిరసనలు తెలిపారు. వీరి ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మద్దతు తెలుపుతూ ఎన్నికల ముందు అలవికాని హామీలతో అన్ని వర్గాల వారిని మోసగించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు వారిని అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న సమ్మెను గుర్తించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా తరలి వెళ్లి స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం ఎఒకు వినతి అందించారు.

కార్యక్రమంలో జెఎసి నాయకులు రమేష్, లక్ష్మణరావు, భారతి, వందన, దమయంతి, జెఎసి నాయకులు పోలినాయుడు, బివి రమణ, ఈశ్వరరావు, రమేష్, భాను, దివాకర్, అప్పారావు, దేవిశ్రీ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

బకాయిల కోసం

యుటిఎఫ్ ఆధ్వర్యాన 12 గంటల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల కోసం యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టి, 12 గంటల పాటు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ సుమారు రూ.18 వేల కోట్లు బకాయిలున్నాయని, ఉపాధ్యాయుల పిల్లల పెళ్లిళ్లు, చదువులు, ఇతర అవసరాల కోసం దాచుకున్న డబ్బును ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని, ఈ సొమ్మును ఇతర అవసరాలకు మరల్చడానికి ప్రభుత్వానికి హక్కు ఎక్కడదని ప్రశ్నించారు. జెఎసి ఛైర్మన్ జి.కిశోర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని అన్నారు. జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ జగన్ మాట తప్పి మడమ తిప్పారని అందుకు ఈ పోరాటం చేస్తున్నామని, ఈనెల 9,10 తేదీల్లో 36 గంటల ధర్నా విజయవాడలో జరుగుతుందని, ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం వంటా - వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ధర్నా రాత్రి8 గంటల వరకు సాగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సాంస్కృతిక బృందం ఛైర్మెన్ ఆర్.గౌరునాయుడు ఆధ్వర్యంలో పలు ఉద్యమ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.మధు, జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీను, బి.కూర్మారావు, ఎం.పైడిరాజు, ఎం.శంకరరావు, కె.జానకీరావు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ముసాయిదా ఓటరు జాబితాపై

అభ్యంతరాలు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ముసాయిదా ఓటరు జాబితాపై గతేడాది డిసెంబరు 9 వరకు వచ్చిన క్లైములు, అభ్యంతరాలను పరిష్కరించినట్టు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాపై గతేడాది డిసెంబరు 9 వరకు వచ్చిన క్లైములు, అభ్యంతరాలను పరిష్కరించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,91,793 ఫారాలు స్వీకరించగా, వాటిలో 1,83,195 ఫారాలు పరిష్కరించి ఓటరుజాబితాలో చేర్చామని, 1473 ఆమోదించామని, 5164 తిరస్కరణకు గురయ్యాయని, ఇంకా 1961 పరిష్కరించాల్సి ఉందని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్లు ఏర్పాటు చేశామని, జిల్లా ఎన్నికల కార్యాలయం, రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయం లేదా ఆర్‌డిఒల వద్ద శాశ్వత సెంటర్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్ ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ప్రజలను పాల్గొనేలా ప్రోత్సహించాలని కలెక్టరు తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పి.కోనవలస చెక్‌పోస్టు పరిశీలన

పాచిపెంట : మండలంలోని పి.కోనవలస చెక్ పోస్టను సాలూరు సిఐ ధనుంజయరావు బుధవారం సందర్శించారు. అలాగే కొత్తగా పద్మాపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు పద్మాపురం జంక్షన్ వద్ద కొత్తగా చెక్పోస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ధూళికేశ్వర ఆలయం నుంచి రావాడ రోడ్డు జంక్షన్ వరకు స్థానిక తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌డిఒ ఎం.లావణ్య హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును చేర్పించుకోవాలన్నారు. ఓటు అనేది ప్రతి పౌరులకి వజ్ర ఆయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉప తహశీల్దార్ నాగేశ్వరరావు, ఆర్ఐ కరుణాకర్, హిజ్రాస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.గీతారాణి, బిఎల్ఒలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ జె.రాములమ్మ కోరారు. గుమ్మలక్ష్మీపురం నుంచి ఎల్విన్‌పేట వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన విలువైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు దేశ ప్రగతికి బాట అంటూ సంబోధించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, ఆర్ఐ గిరిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాంలో జరిగిన ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్‌డిఒ లావణ్య



మిల్లుల యజమానులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ట్రక్ షీట్లను వెంటనే క్లియిర్ చేయాలి : జెసి

లారీలతో వచ్చిన ధాన్యాన్ని తక్షణమే అన్‌లోడ్ చేయాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు సరఫరా చేసిన ధాన్యానికి సంబంధించిన ట్రక్ షీట్లను వెంటనే క్లియర్ చేయడంతో పాటు లారీలతో వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు మిల్లు యజమానులకు సూచించారు. మండలంలోని కొత్తపల్లి సమీపాన శ్రీవెంకటదుర్గ మోరడన్ రైస్ మిల్లును బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని ట్రక్ షీట్లను తక్షణమే క్లియర్ చేయాలని మిల్లు యజమానులు గొట్టాపు త్రినాధరావు, గొట్టాపు స్వామినాయుడును ఆదేశించారు. ఈ సందర్భంగా మిల్లు యజమానులు పలు సమస్యలను జెసి దృష్టికి తీసుకొచ్చారు. మిల్లుల వద్ద వెంటనే అన్‌లోడ్ అయ్యేలా చూడాలని, సమస్యలుంటే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కస్టోడియన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విఆర్ఒ తట్టికోట శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సమ్మెకు సహకరించండి

ర్యాలీ, కరపత్రాలు పంపిణీ
9వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమ న్యాయమైన కోర్కెల సాధనకై సమ్మె చేస్తున్నామని సమ్మెకు ప్రజలు మద్దతు తెలపాలని మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, వాటర్ సెక్షన్ కార్మికులు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె శిబిరం నుంచి ప్రధాన రహదారి గుండా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఆప్కాస్ విధాన కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, ఇంజినీరింగ్ వర్కర్లందరికీ హెల్త్ అలవెన్స్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేష్, గుంట్రెడ్డి గంగయ్యలు, తాడ్డి వినయ్, వంగపండు అప్పలనాయుడు, మేడిశెట్టి కృష్ణ, అరసాడ తాతబాబు, నాగమంగం మల్లేష్, బంగారు రవి, నిర్మల ఇప్పలమ్మ, పావులమ్మ, పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపల్ కార్మికుల సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు మున్సిపల్ కార్యాలయ ముఖద్వారం వద్ద పారిశుధ్య విభాగానికి చెందిన ట్రాక్టర్లను అడ్డుకున్నారు. పర్మినెంట్ కార్మికులతో పని చేయిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, పట్టణ అధ్యక్షులు టి.రాముడు మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు చేయాలని కోరారు. పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. డిమాండ్లు వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.శంకరరావు, పోలరాజు పాల్గొన్నారు.



పార్వతీపురంలో నిరసన ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ : అసెంబ్లీ సాక్షిగా జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని మున్సిపల్ కార్మికులు తొమ్మిదో రోజు సమ్మె సందర్భంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరగుతున్న సమ్మె శిబిరంలో వంటావార్పు నిర్వహించారు.


సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ట్రాక్టర్లను అడ్డుకున్న కార్మికులు

ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు పడాల భాస్కరరావు, వై.హరిబాబు, చింతల సంజీవి, పడాల సాయి, చింతల సురేష్, పి.సూరిబాబు, జి.నారాయణరావు, టి.ఈశ్వర కుమార్, విమల, శ్రీదేవి తదితరులు నాయకత్వం వహించారు.

కమిషనర్, కార్మికుల మధ్య వాగ్వివాదం

పాలకొండ : నగర పంచాయతీ కార్మికుల సమ్మె కారణంగా పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరాకు తీవ్ర ఆటంకం ఎదురైంది. దీనితో బుధవారం నగరపంచాయితీ కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు దగ్గర ఉండి పోటీ కార్మికులను విధుల్లో చేర్చుకుని పనులు చేయించుకోడానికి సిద్ధమయ్యారు. ఆ విషయం తెలిసిన కార్మికులు ఆ ప్రయత్నాలకు అడ్డ తగిలారు. న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతోందని, ఇలాంటి చర్యలు విడనాడాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు కమిషనర్‌ను నిలదీశారు. దీనితో ఇరుపక్షాల మధ్య తీవ్రవాగ్వివాదం చోటు చేసుకుంది. పోటీ కార్మికులు పనులు చేస్తే తాము అడ్డుకుంటామని హెచ్చరించారు.


నారా భువనేశ్వరిని కలిసిన కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

నారా భువనేశ్వరిని కలిసిన జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా బొబ్బిలి వచ్చిన సందర్భంగా అక్కడి టిడిపి కార్యాలయంలో కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో టిడిపి పరిస్థితిని, కార్యక్రమాలను ఆమె వివరించారు.

త్వరితగతిన రబీ ఇ-పంట నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

రబీ సీజన్ 2023కు పంట నమోదులు మండలంలో సాగవుతున్న మినుము, పెసర, మొక్కజొన్న పంటలను ఇ-పంట నమోదు త్వరితగతిన చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ ఏవిఒలను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1,29,012 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. అలాగే జిల్లాలో మొత్తం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ పాల్గొన్నారు.

అవ్వా తాతలను మోసగించినందుకా సంబరాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సామాజిక పెన్షను రూ.2750 నుంచి రూ.3వేలు చేసినందుకు గ్రామాల్లో సంబరాలు చేసి పంచడం ఈ ప్రభుత్వం సిగ్గు మాలినతనానికి నిదర్శనమని మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు అన్నారు. మండలంలోని నాగూరులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు తాను ముఖ్యమంత్రి కాగానే రూ.3వేలకు పెన్షన్ పెంచుతానని ఉపన్యాసాలు ఇచ్చిన సిఎం గెలిచిన తర్వాత ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ పోతానని మోసగించారని ఆరోపించారు. రూ.3వేలు పెన్షన్ వస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూస్తూ కాలం వెల్లదీశారని, ఎన్నికల ముందు రూ.3వేలు చేసినా వచ్చే ఎన్నికల్లో అవ్వా తాతలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటకు చెందిన టిడిపి నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బొమ్మినేని లక్ష్మణరావు తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండల నాయకులతో కలిసి లక్ష్మణరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, జిల్లా పార్టీ కన్వీనర్ పోల ఈశ్వరనారాయణ, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోకి పలు గిరిజన కుటుంబాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో బియ్యాలవలస పంచాయతీ దురిబిలిలో గల టిడిపిలో ఉన్న 40 కుటుంబాలు బుధవారం వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రచర్ల పరీక్షిత్‌రాజ్, ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఆధ్వర్యంలో చినమేరంగిలో వారి అతిథి గృహానికి వెళ్లి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, పరిపాలన నచ్చి వైసిపి పార్టీలో చేరామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, కురుపాం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ వై.వెంకటరమణ పర్యవేక్షణలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్మి గ్రామ సచివాలయం 4, చిన్నగార కాలనీ గ్రామ సచివాలయం-6, చిట్టపూడివలస సచివాలయం-2 చొప్పున క్రీడాకారులు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, ఎస్.పద్మరాజు, కె.సాల్మన్ రాజు, వి.రాజేంద్ర, టి మధు, ఎస్.ఉమామహేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయం జూనియర్ సహాయకులు ఎస్.సూర్యనారాయణ, తదితర పిఇటిలు పాల్గొన్నారు.

5న కొత్త పింఛన్ల సంబరాలు

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 5న కొత్త పెన్షన్ల సంబరాలను నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ ఎంఎల్ఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కొత్త పెన్షన్లు మంజూరు, అలాగే రూ.2750 నుంచి రూ.3వేల వరకు పెన్షన్ లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరవుతారని, కావున లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొనే చూడాలని అన్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - సాలూరు

భూ హక్కుల చట్టం 2023 రద్దు చేయాలని కోరుతూ స్థానిక న్యాయవాదులు బుధవారం రిలేదీక్షలు చేపట్టారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు తాడ్డి తిరుపతిరావు, ఉపాధ్యక్షులు సబ్బాన వేణుగోపాలరావు ఆధ్వర్యాన న్యాయవాదులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రిలేదీక్షలు ప్రారంభించారు. ఈ చట్టంతో పేదల భూములకు రక్షణ కరువవుతుందని చెప్పారు. పెత్తందారులు పేదల భూములను దౌర్జన్యంగా లాక్కునే అవకాశం ఉందని చెప్పారు. వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కోట లక్ష్మణ రావు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి

సీతంపేట : మండలంలో పదివారాల ఉపాధి బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జె.శ్రీరాములు, కార్యదర్శి బి.సాయి డిమాండ్ చేశారు. క్రిస్మస్, సంక్రాతికి చేతిలో డబ్బుల్లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నా అధికారులు ఏమీ పట్టనట్టు ఉన్నారు. సంక్రాతి నాటికి డబ్బులు చెల్లించకపోతే వేతన దారులతో కలిసి ఎండిపిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కావున ఎంపిడిఒ స్పందించి సమస్యను వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పెద్దూరు పాఠశాల పనితీరు భేష్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు బేషుగ్గా ఉందని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. బుధవారం ఆ పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇంగ్లీషు, లెక్కలు సబ్జెక్టులపై ప్రశ్నలు వేయగా, వారు చకా చకా సమాధానం చెప్పడంతో ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యను అందించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యం నాయుడు, సవర ప్రసాద్‌ను అభినందించారు.


చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మాతా సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆఫీసు ఆవరణలో జీవిత భీమా సంస్థలోని అన్ని సంఘాలు కలిసి వేతన సవరణ, నూతన ఉద్యోగుల నియామకం, కొత్త పెన్షన్‌కు బదులుగా పాత పెన్షన్ కొనసాగించాలని, పాలసీదారులకు ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం పార్వతీపురం బేస్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు టెక్కలి ధర్మారావు, ఆర్‌వి ప్రసాద్, ఆఫీసర్ల అసోసియేషన్ శివకుమార్, స్వామి, బంగారాజు, రాఘవేంద్రరావు, కెవి రమణ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సాలూరు: దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే ఆదర్శప్రాయురాలని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు చెప్పారు. ఆమె జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంఘిక దురాచారాలు ప్రబలంగా ఉన్న రోజుల్లో సావిత్రి భాయి పూలే మహిళా అక్షరాస్యత గురించి పోరాడారని చెప్పారు. ఆమె సేవలు భావితరాలకు ఆదర్శప్రాయమని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి చిత్రపటానికి ప్రధాన ఉపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సావిత్రిబాయి పూలే ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.



ఎల్ఐసి కార్యాలయంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ధర్మారావు

కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ వి.గణపతిరావు, ఉపాధ్యాయులు ఆర్సి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆనందరావు మహిళా ఉపాధ్యాయులకు చిన్న చిరుకానుక అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెపి నాగమణి, ఎస్.సుంబోరా, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.రాజకుమారి, మహిళా సహాధ్యక్షులు ఎస్.విశాలాక్షి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త డిడిగా అన్నదొర

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఎం.అన్నదొర బుధవారం నియమితులయ్యారు. అనంతపురం నుంచి ఉద్యోగోన్నతిపై సీతంపేటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ కల్పనాకుమారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని, వసతిగృహాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు యుగంధర్, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

సీతంపేట : గురుకులాల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సీతంపేట ఐటిడిఎ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఐటిడిఎ పిఒకల్పనకుమారి అభినందించారు. స్థానికబాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ఖోఖో, ఆర్చరీలో ప్రథమ స్థానం సాధించారు. అలాగే ట్రిపుల్ జంప్‌లో ప్రథమస్థానం, 400 మీటర్లు, 100 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానాలు సాధించారు. దీంతో పాటు ఆల్ రౌండ్ ఛాంపియన్ షిప్ కూడా సొంతం చేసుకున్నారు. బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు కబడ్డీలో ప్రథమస్థానం, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్, పోటీల్లో ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానం సాధించారు. బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు కబడ్డీ క్రీడలో ప్రథమస్థానం, ఖోఖోలో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, షాట్ ఫుట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, కళాశాల ప్రిన్సిపాళ్లు నాగభూషణరావు, పీడీ లక్షణామూర్తి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ : డిఇఒ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారికి ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇవ్వాలని డిఇఒ ఎన్. ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని బందలుప్పి, పులిగుమ్మి గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లి దండ్రులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు 70 రోజులున్నాయని కావున శ్రద్ధగా చదువుకోవాలని, అలాగే పిల్లలకు మంచి పోష కాహారాన్ని అందించి ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని తెలిపారు. దగ్గర ఉండి పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చారు. ఏదైనా సబ్జెక్టులో అనుమానాలుంటే విద్యార్థులకు నివృత్తి చేయాలన్నారు. ఈ మూడు నెలలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి, శత శాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరిలో టిడిపిలో చేరిన పలువురు వైసిపి ప్రజాప్రతినిధులు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

టిడిపి కేంద్ర కార్యాలయం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన పలు గ్రామాల నుంచి వైసిపి కార్యకర్తలు టిడిపిలోకి చేరారు. వీరిలో పార్వతీపురం మున్సిపాలిటీకి చెందిన ఒకటో వార్డు కౌన్సిలర్ రణభేరి బంగారినాయుడు, మూడో వార్డు వైసిపి నాయకుడు సిగడం భాస్కరరావు, 9వ వార్డు మాజీ కౌన్సిలర్లు కోల శ్రీనివాసరావు, మురళీపండా, పెద్ద బొండపల్లి సీనియర్ మహిళా నాయకులు బొంతాడ లక్ష్మి, ఎమ్మార్ నగరం కు చెందిన నగిరెడ్డి అప్పలనాయుడు, నాయకులు నాయకుడు గ్రంధి రామారావు, సీతానగరం మండలం పెదంకలాం సర్పంచి బలగ శ్రీనివాస్, చిన అంకలాం సర్పంచి తిరుపతిరావు, గాదెలవలస సర్పంచి భోగి శంకరరావు, మాజీ సర్పంచి చుక్క వేణుగోపాల్, దయానిధిపురం సర్పంచి తెంటు రామారావు, బూర్జ మాజీ సర్పంచి నీరస జ్యోతి, బక్కుపేట సర్పంచి గొట్టాపు అప్పారావు, దయానిధి పురం నీటిపారుదల మాజీ చైర్మన్ పోల పరుశురాం తదితరులున్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని చినగుడబ మాజీ ఎంపిటిసి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుంకుడివరానికి పెద్దింటి లక్ష్మీనాయుడు బుధవారం వృద్ధాప్య కారణంగా తుదిశ్వాస విడిచారు. మండలానికి చెందిన మంచి నాయకుడ్ని కోల్పోయామని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని టిడిపి నాయకులు అక్కేన మధుసూదనరావు సంతాపం తెలిపారు.

కన్నంపేటలో జనంలోకి జనసేన..

ప్రజాశక్తి - మక్కువ

జనంలోకి జనసేన కార్యక్రమాన్ని మండలంలోని కన్నంపేటలో బుధవారం జనసేన సాలూరు సమన్వయకర్త గేదెల రిషి వర్ధన్ ప్రారంభించారు. అనంతరం వెంకంపేట వరకు పాదయాత్ర కొనసాగింది. జనంలోకి జనసేన పల్లె పల్లెల్లో పాదయాత్ర కార్యక్రమం మొదటి విడతలో భాగంగా జనవరి 8 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అదే రోజున దబ్బగెడ్డలో జరిగే బహిరంగ సభతో ముగుస్తుందని రిషివర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో మండలం నుంచి పెద్ద ఎత్తున జనసైనికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలందించాలని లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం జగన్నాథపురం ప్రాంతం వార్డు సచివాలయం-1 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారుగా 64 వేల మంది ప్రజలు ఈపథకాన్ని వినియోగించుకున్నా రన్నారు. రెండో విడత మళ్లీ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరేశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, జిల్లా డిఎంహెచ్ఒ జగన్నాథరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు, నాయకులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గిరిజనులకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వం పెంచిన రూ.3000 వై ఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం బుధవారం పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి, మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతంపేట మండల పరిధిలో కొత్తగా మంజూరైన 92 పెన్షన్లను సంబంధిత లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, ఎటువంటి అవినీతికి తావు లేకుండా, అర్హులందరికీ, పెన్షన్ మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మెన్ హిమరక మోహన్‌రావు, ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, వైస్ ఎంపిపిలు కుండంగి సరస్వతి, మూటక విజయలక్ష్మి, ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

పాలకొండ : ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పెన్షన్ హామీ ను నిలబెట్టుకున్నారని ప్రభుత్వ విప్ విక్రాంత్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన పెన్షన్ రూ.3వేలకు పెంపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మరోసారి జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుని ఆదరించాలని అన్నారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మాట్లాడుతూ సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాలి భాను, వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్, ఎంపీడీవో డొంక త్రినాధులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని చినగుడబ, ఎస్ఆర్ పేటలో టీకా కార్యక్రమాన్ని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణుల వివరాలు రికార్డులో ఎంసిపి కార్డులో పరిశీలించారు. పిల్లలకు టీకా వేయాల్సిన గడువు తేదీలను పరిశీలించి వేయాల్సిన టీకాలను, వ్యాక్సిన్ వయల్స్‌ను తనిఖీ చేశారు. అత్యవసర మందుల కిట్ (ఎఇఎస్ఐ)ను పరిశీలించారు. యూవిన్ పోర్టల్‌ను పరిశీలించి టీకా వివరాలను ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ శీతాకాలంలో పిల్లల్లో శ్వాస సంబంధమైన సమస్యలు గుర్తించాలని, వీటికి సంబంధించిన సాన్స్ సర్వే ద్వారా ఐదేళ్లలోపు పిల్లల్లో న్యుమోనియా లక్షణాలను గుర్తించాలని, పిసివి వ్యాక్సిన్ అర్హులైన పిల్లలందరికీ ఖచ్చితంగా పూర్తి చేయాలని అన్నారు. అక్కడ ఉన్న గర్భిణులతో మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు రవణమ్మ, ఈశ్వరమ్మ, సిహెచ్ఒలు మౌనిక, ఇంద్రాణి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నేడు ఫీల్డ్ అసిస్టెంట్ల చలో విజయవాడ

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ఎంపిడిఒ వై.వెంకటరమణకు క్షేత్ర సహాయకులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని, మండల పరిధిలో గ్రామపంచాయతీ బదిలీలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 4న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. కావున ఈ రోజు సెలవు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పోలయ్య, ఎన్.గణపతినాయుడు, బి.శ్రీనివాసరావు, జి.రాజేష్, పి.శంకర్రావు, పి.చిన్నంనాయుడు, కె.గణపతి రావు, వి గంగమ్మ, కే గంగ, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ నాయకులు అల్లు అశోక్ కుమార్, నల్ల సూర్యనారాయణ, నగిరెడ్డి ఆదినారాయణలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ సమస్యలపై ఇప్పటికే కలెక్టరేట్ వద్ద ధర్నా చేశామన్నారు. అలాగే ఈనెల 4న విజయవాడలో జరిగే చలో కార్యక్రమానికి మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు వెళ్లనున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో క్షేత్రసహాయకులు బొద్దాన శంకర్రావు, యేగిరెడ్డి పొలినాయుడు, బూరి దాలినాయుడు, మర్రాపు శంకరరావు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు ప్రారంభం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను ఈనెల 2 నుంచి 31 వరకు వేయనున్నట్టు పశువైద్యాధికారి కె.శైలజ తెలిపారు. కావున ప్రతి రైతు వారి పశువులకు టీకాలు వేయించాలన్నారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గుతుందన్నారు. అలాగే ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం వల్ల రైతు ఆర్థికంగా నష్టపోవడం, పాలు తాగే దూడలో మరణాలు, వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చెడిపోతాయన్నారు. కావున ముందస్తుగా ఈ టీకాలు వేయించాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక స్టేట్ బ్యాంకులో మేనేజర్ విధులు నిర్వహిస్తూ తన విధులకు వస్తున్న సమయంలో వారం రోజుల క్రితం రూ.39 వేలు విలువ గల మొబైల్ సెల్ పోగొట్టుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వి.షణ్ముఖరావు స్పందించి మొబైల్ ట్రేస్ అవుట్ చేసి బుధవారం పోలీసు స్టేషన్లో ఆయనకు అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఫిర్యాదు చేసిన వారం రోజుల్లో మొబైల్ ట్రేస్ అవుట్ చేసి అందించినందుకు ఎస్ఐకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపానన్నారు.

340 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపంలో గల మూలుగూడ జంక్షన్ చెక్ పోస్ట్ వద్ద మంగళవారం రాత్రి ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్ఐ వి.షణ్ముఖ రావు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో స్కార్పియో వాహనంతో 6 ట్యూబులు, 5 కేన్లలో 340 లీటర్ల నాటు సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. సారాను తరలించే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.